క్లుప్తంగా

విజయాంజనేయ స్వామి జయంత్యుత్సవం రేపు


రంగులు వేసిన స్వామివారి విగ్రహం

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద కొలువైన విజయాంజనేయ స్వామి జయంత్యుత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరగనుందని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. స్వామివారి విగ్రహానికి రంగులు వేశారు. నగలతో అలంకరించారు. ఉత్సవం సందర్భంగా 42 పర్యాయాలు హనుమాన్ చాలీసా సంకీర్తన, భజన కార్యక్రమాలతో పాటు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. మండలంలోని భక్తులంతా వచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

చిటిక వ్యాధి నివారణకు టీకాలు


టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

మాడుగుల: ప్రస్తుత సీజన్లో పశువులు చిటిక వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తగా మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలని పాడేరు డివిజన్ ఉపసంచాలకులు సీహెచ్ నరసింహులు సూచించారు. గురువారం మండలంలోని సత్యవరం, గొటివాడ అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన టీకాల కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. మండలంలో 6,540 మేకలు, గొర్రెలకు టీకాలు వేయాల్సి ఉండగా 340 మేకలకు ప్రస్తుతం వేసినట్లు వెల్లడించారు. మిగిలిన వాటికి కూడా వీలైనంత వేగంగా టీకాలు వేస్తామన్నారు.

బ్యాంకు ఖాతాల్లోనే పింఛను జమ

- 3,008 మందికి ఇంటి వద్ద పంపిణీ

మాడుగుల రూరల్: అవ్వతాతలకు ప్రతి నెల అందించే పింఛన్లు ఈ నెల్లో కూడా బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు స్థానిక ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11,929 మంది పింఛనుదార్లకు గాను రూ.3.58 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో 3,008 మంది వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు, వీల్‌చైర్‌కి పరిమితమైన వారికి రూ.90.21 లక్షల నగదును 5వ తేదీలోగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందిస్తారని తెలిపారు. మిగిలిన 8,921 మందికి సంబంధించి రూ.2.68 కోట్లను జూన్ 1న పింఛనుదార్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేజే పురంలో ఆరోగ్య సురక్ష శిబిరం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎల్‌వీఎస్ఎస్ ప్రసాద్ పాత్రుడు గురువారం తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, చిన్న పిల్లల వైద్య నిపుణులతో పాటు సాధారణ వైద్యులు, ఆప్తాల్మిక్ సహాయకులు సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు రేపు

మునగపాక : మండల వ్యాప్తంగా జూన్ 1న అభయాంజనేయస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలను పలు రంగులతో అలంకరించారు. మునగపాకలోని సంతబయిల అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. గవర్ల అనకాపల్లిలో కూడా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సచివాలయం.. సకల సేవల నిలయం

- గ్రామ స్థాయిలోనే 542 రకాల ప్రభుత్వ సేవలు
- రూ.40 లక్షలతో సచివాలయ నూతన భవనం
- ప్రజల సేవలో పెదగొలుగొండపేట సచివాలయం

ఒకప్పుడు ఏ ప్రభుత్వ సేవ పొందాలన్నా.. మండల/జిల్లా కేంద్రాలకు పరుగు తీయాల్సిందే. రోజుల తరబడి, పనులు మానుకుని పడిగాపులు కాయాల్సిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామ స్థాయికి చేరాయి. ప్రజలు ఊరు దాటనక్కర్లేదు. పనులు మానుకోవాల్సిన పనిలేదు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైంది.


లబ్ధిదారుకు బీమా చెక్కును సచివాలయంలో అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం: మండలంలో మారుమూల గ్రామమైన పెదగొలుగొండపేటలో సచివాలయం ఏర్పాటుతో ప్రజలకు అవసరమైన అన్ని సేవలు గ్రామంలోనే అందుతున్నాయి. ఈ గ్రామానికి నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గ్రామస్తులు ఊరు దాటి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కు. సచివాలయం ఏర్పాటు కాక ముందు ప్రభుత్వ పరంగా ఏ సేవ పొందాలన్నా నాతవరం మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. ఇప్పుడా పరిస్థితి లేదు.

అందుబాటులో అన్ని సేవలు

ప్రభుత్వం పెదగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, చినగొలుగొండపేట పంచాయతీలకు కలిపి పెదగొలుగొండపేటలో సచివాలయం ఏర్పాటు చేసింది. ప్రజలకు సేవలు అందించేందుకు 10 మంది సిబ్బందిని నియమించింది. 542 సేవలు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 116 రకాల సేవల్ని ప్రజలు పొందుతున్నారు. 2022 జనవరి నుంచి ఏపీ సేవా సర్వీసెస్ నెట్ సేవలు కూడా ప్రారంభించారు. వీటితో పాటు సంక్షేమ పథకాలు, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర సేవలుక ఊడా సచివాలయంలోనే అందిస్తున్నారు. సచివాలయం ద్వారా అర్హత ఉన్న లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.4.69 కోట్ల లబ్ధి చేకూరింది.


పెదగొలుగొండపేట సచివాలయం

తొలి భవనం ఇక్కడే

నియోజకవర్గంలో పెదగొలుగొండపేటలోనే మొదటిగా సచివాలయానికి సొంత భవనాన్ని నిర్మించారు. ఇందుకు రూ.40 లక్షలు వెచ్చించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా నూతన సచివాలయా భవనాన్ని ప్రారంభించి, అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. ఇక్కడి సేవలపై కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి స్వయంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును ప్రశంసించారు. ఈ మారుమూల ప్రాంతంలో సచివాలయ భవనంతో పాటు హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలకు కూడా నూతన భవనాలను నిర్మించి, మూడు పంచాయతీల ప్రజలు ఊరు దాటాల్సిన పనిలేకుండా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు.


కలెక్టరు రవి పట్టన్‌శెట్టి సచివాలయ సందర్శన(ఫైల్)


సచివాలయంలో సేవలు అందిస్తున్న సిబ్బంది

సత్వర సేవలు



సచివాలయానికి వచ్చే ప్రజలు నిరీక్షించే పనిలేకుండా సత్వర సేవలందిస్తున్నాం. గ్రామంలో ఏ సమస్య ఉన్నా, సచివాలయానికి నివేదిస్తే నిబంధనల మేరకు వెంటనే పరిష్కారిస్తున్నాం. వలంటీర్ల ద్వారా ఇంటింటి డేటా తీసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందిస్తున్నాం.

– శ్రీను, పంచాయతీ కార్యదర్శి

రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం



ఇంటి స్థలాలు, భూముల మ్యుటేషన్లు, సదరం సర్టిఫికెట్లు, స్లాట్ బుకింగ్ తదితర సేవలన్నీ అందిస్తున్నాం. పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి ప్రభుత్వం ఆదేశించిన ఆన్‌లైన్ సేవలన్నీ అమలవుతున్నాయి. గ్రామసభ ద్వారా సచివాలయ సేవలపై అవగాహన కల్పిస్తున్నాం.

– మాతయ్యనాయుడు, డిజిటల్ అసిస్టెంట్

పైసా ఖర్చు లేకుండా బీమా



నా భర్త అనారోగ్యంతో మరణించారు. వైఎస్సార్ బీమా లబ్ధి చేకూరింది. తొలుత రూ.10 వేలు నగదు అందించారు. మిగిలిన రూ.90 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. పైసా లంచం చెల్లించలేదు. వలంటీరే కాగితాలు తీసుకెళ్లారు. దుఃఖంలో ఉన్నపుడు సచివాలయం ఆదుకుంది.

– అల్లు రాజేశ్వరి, ఆర్‌పీ అగ్రహారం

వేసవి శిబిరాలతో విజ్ఞానం, వినోదం

ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, నీతి కథలు, డ్రాయింగ్, ఇంగ్లిష్ గ్రామర్ శిక్షణ, క్విజ్ తదితర విజ్ఞాన సంబంధిత అంశాలతోపాటు, ఆటపాటలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆనందంగా పాల్గొంటున్నారు.


కొత్తకోట గ్రంథాలయంలో క్విజ్ పోటీ నిర్వహిస్తున్న లైబ్రేరియన్ వరహామణి

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో బాల బాలికలకు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మందికి పైగా పిల్లలు నిత్యం హాజరవుతున్నారు. వీరికి కథలు చెబుతూ, డ్రాయింగ్ నేర్పిస్తూ, బుక్ రీడింగ్ చేయిస్తూ వారికి పలు కొత్త విషయాలను తెలియజేస్తున్నారు. గురువారం కథలు చెప్పడంతో పాటు క్విజ్ పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులందించనున్నట్లు గ్రంథాలయాధికారి వరహామణి తెలిపారు.

హ్యాండ్ రైటింగ్ పోటీలు

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి శిబిరాలు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి హ్యాండ్ రైటింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ప్రతిభ చూపారు. పోటీల అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. వేసవి శిబిరాలను విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


హ్యాండ్ రైటింగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మ్యూజికల్ చైర్ పోటీలు

చీడికాడ: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా చీడికాడ శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలు నేర్పించారు. డిక్టేషన్ ద్వారా తప్పుల్లేకుండా రాయించారు. అనంతరం మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రంథాలయాధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నర్సీపట్నం: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని రిసోర్స్ పర్సన్ ఎస్.పద్మ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా గురువారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక రోడ్డు ప్రమాదాలు జరిగి, అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆర్ట్ టీచర్ శ్రీనివాస్ విద్యార్థులకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.దమయంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చీడికాడ గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ పోటీలు


తాము వేసిన చిత్రాలను చూపుతున్న చిన్నారులు

వచ్చే నెలలో రైతు కూలీ సంఘ మహా సభలు

చోడవరం రూరల్: వచ్చే నెలలో మూడు రోజుల పాటు ఏలూరు జిల్లా కేంద్రంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం మహా సభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు కోరారు. ఈ మేరకు గురువారం పట్టణ శివారు రేవళ్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ, గిరిజన పీడిత ప్రజల హక్కుల సాధనకు పనిచేస్తున్న రైతు కూలీ సంఘం మహా సభలు జూన్ 15, 16, 17 తేదీలలో జరగనున్నాయన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నప్పటికీ రైతుల భూమి, సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం లేదన్నారు. పలు సమస్యల పరిష్కారానికి, తదనంతర పోరాట కార్యాచరణను మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు, రైతు కూలీలు హాజరు కావాల్సిందిగా కోరారు.

పద్మజ సుజుకీ నూతన షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభోత్సవంలో సుజుకీ సేల్స్ జోనల్ మేనేజర్ ప్రమోద్ పాండే, వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్‌దేవ్

చోడవరం: వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న చోడవరం పట్టణంలో పద్మజ సుజుకీ మోటార్ సైకిళ్ల నూతన షోరూంను సుజుకీ కంపెనీ సేల్స్ జోనల్ మేనేజర్ ప్రమోద్ పాండే, వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో అగ్రగామిగా ఉన్న పద్మజ సుజుకీ కొత్త షోరూం ఏర్పాటుతో స్థానికులకు మరింత మెరుగైన సేవలు అందనున్నట్లు తెలిపారు. చోడవరం పరిసర ప్రాంత ప్రజలు సుజుకీ వాహన కొనుగోళ్లకు, వర్క్‌షాప్ సేవలకు తమ షోరంను వినియోగించుకోవాల్సిందిగా కోరారు. కొత్త షోరూం ఏర్పాటుతో పద్మజ సుజుకీ రికార్డు స్థాయిలో సేల్స్‌ను నమోదు చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. అతి తక్కువ డౌన్‌పేమెంట్స్, వడ్డీ రేట్లతో ఫైనాన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షోరూం జీఎం రఫీ, పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో వరి విత్తనాలు సిద్ధం


దేవరాపల్లి ఆర్బీకేలో విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లకు ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీఫ్ వరి విత్తనాలను మొలక శాతం ఆధారంగా నాణ్యతను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. మండలంలోని దేవరాపల్లి సహా పలు ఆర్బీకేల్లోని విత్తనాలను, రికార్డులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్‌కు దేవరాపల్లి మండలంలోని 20 ఆర్బీకేల పరిధిలోని రైతులకు 1,350 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని, ప్రస్తుతం 16 ఆర్బీకేలకు 1,050 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. మిగిలిన ఆర్బీకేలకు విత్తనాలు త్వరలోనే వచ్చేస్తాయన్నారు. సోనామసూరి 42 క్వింటాళ్లు, సాంబమసూరి 160 క్వింటాళ్లు, అమర్ 113 క్వింటాళ్లు, శ్రీధృతి 383 క్వింటాళ్లు, మార్టేరు సాంబ 119 క్వింటాళ్లు, స్వర్ణ 89 క్వింటాళ్లు, శ్రీకాకుళం సన్నాలు 360 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 4 క్వింటాళ్లతో పాటు అధునాతన వంగడాలు మరో 75 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వరి నారు మడులను దుక్కు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు కె.సత్యారావు, డి.వరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సరైన పత్రాల్లేని 37 వాహనాల స్వాధీనం

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి యాతపేటలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో నర్సీపట్నం టౌన్, రూరల్ సర్కిల్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. యాతపేటలోకి పోలీసులు గుంపులుగా రావడంతో గ్రామం ఉలిక్కిపడింది. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి రికార్డుల్లేని 36 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. వివిధ నేరాల్లో ప్రమేయం ఉన్న 11 మందిపై రౌడీ షీట్ తెరిచినట్లు పేర్కొన్నారు. ఒపెన్ చేశామన్నారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు. టౌన్, రూరల్ సీఐలు క్రాంతికుమార్, హరి, ఎస్ఐలు సుధాకర్, ఉమామహేశ్వరరావు, భీమరాజు, రామారావు, కృష్ణారావు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న రికార్డుల్లేని వాహనాలు

తారెత్తించిన ఎండలు

బుచ్చెయ్యపేట: మండలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సాయంత్రం 5 గంటలైనా ఎండ తీవ్రత తగ్గట్లేదు. అసలే వేసవి, రోహిణి కార్తె కావడంతో ఎండ తీవ్రత, వడగాల్పులకు మండల ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం మండలంలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలకుపైనే నమోదయింది. డాబా ఇళ్లు, రేకుల ఇళ్లలో ఉండే వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. పలువురు ఎండ వేడిని తట్టుకోలేక జోలపోయారు. బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాది, సీతయ్యపేట నాలుగు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెలబోయాయి. అత్యవసర పనులపై బయటికి వచ్చినవారు ఎండను తట్టుకోలేక ముఖానికి గుడ్డలు చుట్టుకుని, టోపీలు ధరించి రాకపోకలు సాగించారు. పాదచారులు ఎండ, ఉక్కపోతకు తట్టుకోలేక వడివడిగా అడుగులు వేస్తూ తమ గమ్య స్థానాలకు చేరుకున్నారు.

గొలుగొండ: ఎండలు మండుతున్నాయ్. ఉదయం నుంచే భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. గురువారం ఉదయం 10 గంటలకే ఏఎల్ పురం, గొలుగొండ, చీడిగుమ్మల గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. ఎండల తీవ్రతకు వాహనదార్లు సైతం ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు బయటకు వచ్చే సాహసం చేయలేకపోతున్నారు.

కె.కోటపాడు: ఎండలతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వేసవి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉన్నాయి. దీంతో మండల ప్రజలు బయటకు రాక, ప్రధాన కూడళ్లు బోసిపోయాయి.

మాడుగుల రూరల్: ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. మండలంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో వేసవి తాపం తీర్చుకోవడానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయించారు. పుచ్చకాయలు, కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది.


ఎండ వేడికి తలపై గుడ్డలు అడ్డుపెట్టుకుని రాకపోకలు సాగిస్తున్న మహిళలు


కె.జె.పురంలో శీతల పానీయాలు సేవిస్తున్న బాటసారులు


ఎండను తట్టుకోలేక తలపై కండువాతో వృద్ధుడు


ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా గొలుగొండ ప్రధాన రోడ్డు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని భోజన నిర్వాహకులకు ఎంఈవోలు పీఎస్ఎన్ మూర్తి, జాన్‌ప్రసాద్ సూచించారు. పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించే లక్ష్యంతో గురువారం భోజన నిర్వాహకులకు మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. రుచిగా వండిన నిర్వాహకులకు బహుమతులు అందించారు. విద్యార్థులకు పోషక విలువలున్న ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీడీవో చంద్రరావు సూచించారు. ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


వంటకాల తయారీలో గెలుపొందిన నిర్వాహకులకు బహుమతులిస్తున్న అధికారులు

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు


సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: వేసవి ముగిసేంత వరకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండలంలో గురువారం మన్యపురట్ల, గన్నవరం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి గ్రామాల్లో ప్రధాన సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి, కొన్ని గ్రామాల్లో తాగునీరు సరఫరా కావట్లేదని, అక్కడ బోర్లలో మరింత లోతుగా పైప్‌లు వేయాల్సి ఉందని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన పైపులు సిద్ధంగా ఉన్నాయని, తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు, గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరుతుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ఆర్బీకేలకు విత్తనాల కోసం వచ్చే రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.